# గాలిపాటు

కె.వి.రామిరెడ్డి



"పెదనారప్ప కూతురు పద్మావతి వచ్చిందటరా ప్రతాపూ " తీగ టమోటాకు దడి సరిచేస్తూ అంది అమ్మ.

ఒక్కసారి గుండె గొంతులోకొచ్చినట్టనిపించింది.

రెండేళ్లయింది పద్మావతిని చూసి. రెండు మూడు సార్లు ఆమె పల్లె కొచ్చినా చూడలేకపోయాను.

నేను మాట్లాడక పోయేసరికి మళ్లీ అమ్మే " ఎట్లాంటి పద్మావతి ఎట్లా అయిపోయిందిరా...ఆడదాని తలరాత ఆదేవుడు కాదు, మగోడే రాస్తాడు" అంది.

పంటకాలవ నీటితో మట్టిచేతులను కడుక్కున్నాను. అమ్మ కొంగుతో తుడుచుకుంటుంటే-

" బంగారం లాంటి నా కొడుక్కు ఇచ్చినా సిరిలక్ష్మిలా కళకళలాడిపోయేది పిల్ల " నా జుత్తుమీది గడ్డపరకను తీస్తూ ప్రేమగా అంది అమ్మ.

" సర్లే అమ్మా, నీ కొడుకు నీకు మంచోడు. పద్మావతి మొగుడు వాళ్లమ్మకు మంచోడు " అన్నాను.

" నీకు ఇంకొకరితో పోలికట్రా. అయినా నీకేం తెలుసు...పద్మావతిని చేసుకున్నోడు మామూలోడు కాదు. ఆనాబట్ట బిడ్డను ఈ పొయ్యిలో తీసి ఆ పొయ్యిలో ఏసి ఏయించుకుతింటున్నాడట. ఉన్నదంతా వూడ్చిచ్చా ఆ పెద నారప్ప. బంగారం పాయ. డబ్బులూ పాయ. మిగిలింది ఆ భూమి. ఆడి దివసం చేయడానికి అది కూడా అమ్మి కట్టాలట. అంతోటి మొగోడు భూమ్మీద పుట్లేదనుకుంటున్నాడు " కోపంగా మాట్లాడుతోంది అమ్మ.

పద్మావతి కాపురం గురించి తెలిసే కొద్ది నాలో నేను బాధపడ్డమే గానీ ఎవరి దగ్గరా బయటపడేవాన్ని కాదు. అదేదో నా బాధలా అనిపించేది. నా బాధను నాలోనే దాచిపెట్టేసుకోవడం నాకు చిన్నప్పటినుంచి అలవాటయిపోయింది. లేకుంటే పద్మావతి మీద నాకు మనసుందని అమ్మకు ఏమాత్రం తెలిసినా పోయి పెదనారప్పమామను అడిగేది. పద్మావతి క్కూడా నామీద మనసుందని తెలిస్తే ఇక ఆగే ప్రసక్తి వుండేదా?! అవతల వాళ్ళు కాదు కూడదన్నా వినకుండా ఇద్దరిని కలిపేది. అమ్మకు చెప్పకుండా నేనే పొరపాటు చేశానేమో? అయినా ఆ రోజుల్లో నా ప్రేమ గురించి అమ్మకు ఎలా చెప్పగలను. ఏ మాత్రం ఆస్తి పాస్తులు లేని కుటుంబం ఆయె మాది. ఎవరివో ఒకరివి భూములు కౌలుకు తీసుకుని చేసుకోవడమే. అదీ అమ్మ రెక్కల కష్టం మీద సాగే వ్యవసాయం. ఎంత వద్దన్నా చదువు పేరుతో నన్ను పొలంలోకి అడుగుపెట్టనిచ్చేది కాదు అమ్మ.

" ప్రతాపుడూ నువ్వు చదువుకుని కలెక్టరు గిరి చేయాలని కాదురా...చదువుంటే మనిషికింద లెక్క. మీ నాయన తిక్కబాగులోడు చదువులేకనే ఆస్తినంతా పోగొట్టుకుండే. నాబిడ్డ అలా కాకూడదురా. ఆస్తులు కూడగట్టుకోగలం. కానీ నిలుపుకోవాలంటే అంతో ఇంతో తెలివిడి వుండాలె" అంటూ తనే కష్టపడేది. ఆదరిద్రం రోజుల్లో నేను పెళ్ళి మాట ఎలా ఎత్తగలను. ఒకవేళ నేను ప్రస్తావించినా నారప్ప మామ ఒప్పుకునేవాడా? ఆ రోజుల్లో బాగా ఆస్తిపాస్తులున్న ఆసామి ఆయన. అమ్మ అడిగి లేదనిపించుకుంటే నేను భరించలేను. అందుకే మూగగా వుండిపోయాను.

పద్మావతి మటుకు ధైర్యం చేసి అడగమనేది. నువ్వంటే నాకు చాలా ఇష్టం అనేది. మౌనంగానే వుండిపోయేవాణ్ణి. పద్మావతీ నా జీవితం నుంచి దాటేసింది. నా ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లు చేశాను. ఊర్లో స్కూలు పెట్టాను. పాతిక ఎకరాల భూమి కొన్నాను. ముప్పైఏళ్ళు దాటుతున్నా ఏదో ఒకటి చెబుతూ పెళ్ళి మాటను దాటేస్తూ వచ్చాను.ఇదంతా ఆరేళ్ళలో జరిగిన కథ. మాజీవితాలు ఇలా మారితే బాగా బతికిన పద్మావతి వాళ్లు దెబ్బతిన్నారు. వల్లెగొడవల్లో పడి పద్మావతి వాళ్ళ అన్న సగం ఆస్తి కరిగించాడు. మురా కక్షల్లోనే పోయాడు.

పెద్దక్కను మంచి సంబంధం అని బెంగుళూరులో ఓఇంజనీరుకు భారీగా కట్నం ముట్టచెప్పి కట్టబెట్టారు. ఏమయిందో తెలీదు గానీపెళ్ళయిన మూడేళ్ళకు ఆమె మటుకు కాల్చుకుని చచ్చిపోయింది. ఆమె కొడుకును పెదనారప్పనే పెంచుకుంటున్నాడు. ఇప్పుడు పద్మావతికి ఒక చిన్న తమ్ముడు వున్నాడు. తండ్రితో పాటు వ్యవసాయం పనులు చూసుకుంటున్నాడు.

పద్మావతి గురించి ఆలోచించుకుంటూ బావిగట్టుమీదే కూర్చుండిపోయాను. ఏదో తెలీని మూగబాధ మనసును పిండుతోంది.

మెల్లగా చీకటితెరలు ఆకాశాన్ని కమ్ముకుంటున్నాయి. ఎవరో పుణ్యాత్మురాలు ఒక్కొక్కటిగా వెలిగిస్తున్నట్టు ఆకాశంలో నక్షత్రాలు అక్కడక్కడా తళుక్కుమనసాగాయి. విరగగాసిన హైబ్రిడ్ టమోటాలు తీగలకు భారంగా వేళ్ళాడుతున్నాయి. తోటచుట్టూ కంచెకు అల్లిచ్చిన బీరతీగలకు పసుప్పచ్చపూలు ఎంతందంగా అమరాయో? తీగలు, పూలు, కాయలు, గడ్డి అన్నీ కలిసి గాలికి సుగంధాన్ని అద్దినట్టున్నాయి. వంటగాలి హాయిగా వీస్తోంది. ఇవేవీ పట్టనట్టు రకరకాల ఆలోచనలతో నా తల వేడెక్కుతోంది.

మా తోటకు ఆనుకునే వున్న నారప్పమామవాళ్ళ పొలంలో మనుషులు వెళుతున్న అలికిడి వినిపించింది. బావిపక్క గదిలో దీపం పెట్టి బయటకు వచ్చిన అమ్మ నా నుదుటన కుంకుమబొట్టు పెడుతూ "ప్రతాపూ నారప్ప మామ వాళ్ళు వచ్చినట్టుండారుగానీ ...పలకరించి వస్తాము పద బిడ్డా " అంది. నేను కదలక పోయేసరికి

"ఎనిమిది గంటలకు కదరా కరెంటు వచ్చేది. అప్పుడొచ్చి నీళ్ళు పెట్టుకోవచ్చు పదా. ఈ లోగా గంగాధరూ వస్తాడు " అంది అమ్మ.

అమ్మ మాటను కాదనలేక లేచాను. మనసులోపలెక్కడో పద్మావతిని చూడాలన్న కోరిక బలంగాకలగసాగింది. గుండె వేగంగా కొట్టుకుంటోంది.

అమ్మ ముందు నడుస్తుంటే వెనగ్గా నడవసాగాను. పొలంలోనే గుడిశె వేసుకుని అక్కడే రాత్రిళ్ళు పడుకుంటుంటాడు నారప్ప మామ. ఆ ఆరెకరాల పొలంలో చెనిగికాయలు వేశాడు. అక్కడ నీటి వసతి లేదు. వంటకు సరిపడా నీళ్లను మాబోరునుంచి ఇస్తుంటాము.

నారప్పమామ వాళ్ళ పొలంలో చెనిగిపంట ఒత్తుగా వుంది. అక్కడక్కడా పూత కూడా పట్టింది. " పంట బావుందిరా ప్రతాపూ, అయినా ఏం లాభంలే ...ఈసారి ఎంతెత్తుకు రమ్మని పంపాడో ఆనాబట్ట" అంటోంది అమ్మ.

నాకు మాత్రం పద్మావతిని చూడాలన్న కోరిక అడవిలో పిచ్చిపిచ్చిగా అల్లుకుపోయే బేళీపూలమాదిరిగా మనసంతా అలుముకుంది. తోటలోకి నలుగురైదుగురు మనుషులు వచ్చినట్టేవుంది. మరి పద్మావతి వచ్చిందో లేదో? మనసులో ఓ మూల అనుమానం.

ఒక ఫర్లాంగు దూరం నడిచాం. నారప్పమామ వాళ్ళ గుడిసెలో లాంతరు వెలిగిస్తోంది ఒకామె.

" దీపం పెడుతున్నావా బంగారు తల్లీ..." అంటూ అమ్మ లోపలికెళ్ళింది. ఒక్కసారిగా కరెంటు ఒంట్లో పాకినట్టనిపించింది. అమ్మ పద్మావతినే అలా అంటుంది గదా ...ఆ ఆలోచనతోనే కాళ్లలో కదలిక ఆగిపోయింది. బయటే నిలబడిపోయాను.

" ప్రతాపుడూ వచ్చాడు" అమ్మ లోపల చెబుతోంది.

" అవునా... లోపలికి రా నాయనా ప్రతాపూ " అనుకుంటూ నారప్ప మామ గుడిశెలోంచి బయటకు వచ్చాడు. ఏదో ఒకటి మాట్లాడాలని

" పంట బావుంది మామా" అన్నాను.

" ఏదో నీ పుణ్యంరా...నువ్వు నీళ్ళియ్యబట్టి ఇంత పంటపండించుకుంటున్నాము" అన్నాడు నారప్పమామ.

" ఛ..ఛ అవేం మాటలు మామ...నీకు నీళ్ళు ఇయ్యటం ఓ ఘనకార్యమా..." అంటుండగానే పద్మావతి వాళ్లమ్మ బయటకు వచ్చింది.

" లోపలికి రా ప్రతాపూ...పద్మావతి వచ్చింది...నిన్ను చూడక చాన్నాళ్లయిందంటోంది" అందామె.



తడారుతున్న పెదాలను తడుపుకుంటూ...లోపలి గడబిడను అణచుకుంటూ లోపలికి పోయాను.

నులకమంచం మీద అమ్మ పక్కన కూర్చున్న పద్మావతి చటుక్కున లేచి నిలబడింది. ఆ లాంతరు వెలుగులో ఆమె కంటితడి కనిపించింది. అమ్మ కళ్లల్లోనూ కన్నీళ్ళు. ఇంకాసేపు బయటే వుంటే బావుండేది అనిపించింది.

మాటలను బలంగా కూడదీసుకుంటూ "బావున్నావా...పద్మావతీ " అంటూ పలకరించాను.

"ఆ..బావున్నాను..నువ్వు బావున్నావా ప్రతాపుడూ"అంది.

ఎందుకో చుట్టూ గాలిబరువుగా వున్నట్టనిపిస్తోంది. ఇదమిద్ధంగా తెలీని ఇబ్బంది ఇరుకున పెడుతోంది.

మూడేళ్ళ పద్మావతి కూతురు వచ్చి నాపక్కన కూర్చుంది.

ఆ పాప చేతిని పట్టుకుని " నీపేరేంటమ్మా" అని అడిగాను.

" అమ్మ పార్వతి అని పిలుస్తుంది. అదే నాకిష్టం. నాన్నా ఏయ్..ఏయ్ అని పిలుస్తుంటాడు. నాకు కోపం ప్రతాపుడూ " అందా పిల్ల. అక్కడున్న అందరూ నవ్వారు. నారప్ప మామ "అదేందే పెద్దాచిన్నా లేకుండా" అంటూ పిల్లనెత్తిన మొట్టాడు.

ఇవేవీ నాకు పట్టలేదు. పార్వతి అమ్మ పేరు.

పద్మావతి కేసి చూశాను. ఆ తడికళ్లలో మెరుపు.

" ప్రతాపుడూ చూశావా...కోడలు నా పేరే పెట్టుకుంది" ఆ పిల్లను తన ఒళ్లో కూర్చోపెట్టుకుంటూ అంది అమ్మ.

అమ్మను చూస్తూ నవ్వాను.

పద్మావతి వాళ్లమ్మ బయటనుంచి నీళ్ళు తీసుకొచ్చింది. కుండను పక్కన పెట్టి అమ్మ పక్కన వచ్చి కూర్చుంది. పద్మావతి అమ్మకు మరో పక్కన కూర్చుంది.

" పద్మావతి పొద్దున వచ్చింది వదినా. మళ్లీ మామూలే అనుకున్నాం. అది కాదట. దాన్ని వదిలేయడానికే కూర్చున్నాడు. ఆ విడాకుల కాగితాలేవో తెచ్చి దాని సంతకం కూడా పెట్టించుకున్నాడట. ఇక్కడ మేము పూర్తిగా ఒట్టిపోయామని తెలిసిపోయింది ముండాకొడుక్కి. బిడ్డను ఒకటే హింస పెడుతున్నాడు " అంటూ చటుక్కున పద్మావతి చేతిని లాక్కుని అమ్మకు చూపింది. కుడిచేయి పొడుగునా నల్లటి చార. "ఆ నాబట్ట సంతకం పెట్టడానికి చేసిన అఘాయిత్యం ఒదినా" అంటూ ఆపుకోలేక ఏడ్చేసిందామె.

పద్మావతి తెల్ల చేతిమీద ఆగీత పాముచారలా వుంది. అక్కడ ఎవరూ లేకుంటే నేను ఏడ్చేసే వాణ్ణే...మామూలుగా కాదు గుండెలు బాదుకుంటూ...కారడానికి సిద్ధమవుతున్న కన్నీటిని అదిమిపెట్టాను.

" అదేందోనమ్మా...ఈ పల్లెల్లో ఏం సుఖపడతారులే అని ఆడపిల్లల్నీ టౌన్లకిస్తే ఇదీ గతి. కట్టుకున్నదాని పుసురు పోసుకోవడమే ఆబేవార్సుగాళ్ళ పనిలా వుంది. లక్షణమైన పిల్ల. వాడా ఇంజినీరు. సుఖంగా బతక్కుండా ఎందుకు సచ్చిపోతారో?! అయినకాడికి డబ్బిస్తిరి. బంగారం ఇస్తిరి. వున్నదంతా వూడ్చి ఇమ్మన్నా ఇస్తామంటున్నారు. అయినా చాలట్లేదంటనా? " అమ్మ కోపంగా మాట్లాడుతోంది.

" ఏంచేస్తామమ్మా. వూర్లో పెద్దమనుషులను తీసుకుని కూడా హైదరాబాదుపోయొచ్చా. బతిమిలాడిరి. బెదిరించిరి. అప్పుడు ఇక బానే చూసుకుంటానంటాడు. మనుషులు ఇలారాగానే అక్కడ బిడ్డను ఏడ్పించుకుతింటాడు. ఇది కాబట్టి ఆరేళ్లునెట్టుకొచ్చింది. నాలాంటిదైతే ఆనాబట్టకు ఏవిషమో కలిపిపెట్టి నేను తిని చస్తును" ఓవైపు ఏడుస్తూనే మాట్లాడుతోంది పద్మావతి వాళ్లమ్మ.

ఆమె మాటల్లో కోపమూ, ఉక్రోషం కలగలసి పోతున్నాయి. నాబిడ్డను ఏడ్పించుకుతిన్నోడు ఏం బాగుపడతాడు...నాశనమైపోతాడు అంటూ శాపాలు పెడుతోందామె.

" ఫోన్లే పాపా...బిడ్డ బతికే వుంది. మొన్నా మధ్య కొత్తపల్లి సాయన్న బిడ్డ ఏమయిందో తెలుసు కదా.

ఆనాకొడుకు ఇట్లాగే చేస్తావుండె. వాణ్ణి బతిమలాడి బామాల్తావుండిరి. బిడ్డ ఇంటికొచ్చి ఎంత కొట్టుకున్నా వినకుండా అవీఇవీ చెప్పి మళ్ళీ వదిలిపెట్టి వచ్చేది. ఏమాయ...దాన్నెత్తిన కిరసనాయిలుపోసి అంటించే వాడు. ఆడబిడ్డను అల్లుళ్ళ దగ్గరకు కాదు వంపేది అడవిలో పులిదగ్గరకు పంపినట్టే అయిందమ్మ పరిస్థితి. బాగా ఆలోచించుకోండి. ఎట్లా వద్దనుకుంటున్నా కావురాన్ని ఏం చేసి నిలబెట్టగలం. అది ఎక్కడూరో ...ఏం పాడో..మనం దగ్గరుండి కావురం చేయించలేము కదా..వదిలేస్తే వదిలేయని...బిడ్డ బంగారంలా బతుక్కుంటుంది..నువ్వు బిడ్డను కష్టపడి కన్నది ఎవడో వూడుదాకలోడిచేతిలో హింసపడడానికి కాదుగదా " అమ్మ వాళ్ళకు ధైర్యాన్ని నూరిపోస్తోంది.

అమ్మ మాటలను శ్రద్ధగా వింటున్న నారప్పమామ-

"అవునమ్మా నేనూ అదే అనుకుంటున్నాను. ఇక మళ్ళీ వాడిదగ్గరకు వెళ్లి బతిమిలాడడమో, బెదిరించడమో యాడ చేసేది. బిడ్డ రాత ఇలాకాలింది అనుకోవడమే. చూస్తూచూస్తూ దాన్ని చంపుకోలేము కదా" అన్నాడు.

ఒకప్పుడు నారప్పమామ అంటే పల్లెలో హడలు. ఆయన ఏదైనా చెబితే ఎంతవాళ్ళయినా తలవూపేవారు. కొబ్బరికాయను అరచేత్తో అవలీలగా కొట్టేసేవాడాయన. దారికి అడ్డంవచ్చిన ఎంత పెద్దబండనయినా అవలీలగా వక్కకు దొర్లించేశేవాడు. అలాంటివాడు అల్లుడికి చులకనైపోయాడు. అతను ఏది చెబితే అది చేశాడు. అయినా కూతురు కాపురం చల్లగా సాగుతుంటే చూసే భాగ్యం మాత్రం లేకపోయింది.

మాటల్లో వుండగానే ఇంటినుంచితెచ్చిన గంపలోంచి అన్నం బయటకు తీసింది పద్మావతి.

" మీరు తినండి. ఇంక కరెంటు కూడా వస్తుంది" అంటూ అమ్మ లేచింది.

" భలేదానివిలేమ్మా...మీరు తినిపొండి..." అంటూ అమ్మను కూర్చోబెట్టింది పద్మావతి వాళ్ళమ్మ.

" పద్మావతీ, కొడుకు బండి దిగట్లేదు పార్వతమ్మ. ఆ మోటర్ సైకిల్ ఎక్కేదీ... ఇంటికి...తోటలకు తిరిగేది..జాతకం అంతా" అంటూ నారప్పమామ కూతురుకి చెబుతుంటే పద్మావతి ముసిముసిగా నవ్వింది.

" ఏమి కుశాలపోతావులే నారప్పన్నా...నేను బండి ఎక్కనన్నా ప్రతాపుడు వింటాడా...వడ్డించు వదినా " అంటూ అమ్మ నాకేసి చూసింది.

నాకూ వడ్డించారు. పులవచారు ఇంకా వేడి తగ్గలేదు.

" మీరు ఇక్కడున్నారని గంగాధరుడు చెప్పాడు. ప్రతాపుడికి పులవచారు ఇష్టం కదా అని చేసుకుని తెచ్చాం" అంటూ నారప్ప మామ వచ్చి నావక్కన కూర్చున్నాడు.

నేను నిశ్శబ్దంగా తినడం పూర్తిచేశాను ...మధ్య మధ్యలో పద్మావతిని చూస్తూ....

ఒకప్పుడు పద్మావతి ఎలా వుండేదంటే గుమ్మడి పువ్వులా వుండేది. కొండ అంచున విరిసిన అడవి మల్లెలా వుండేది. ఎప్పుడూ ఏదో ఒకటి పాడుతూనే వుండేది. ఎవరైనా ఎంత బాగా పాడతావు పద్మావతీ అంటే-అదేముంది గాలిపాట అంటూ మళ్ళీ పాడుకుంటూ వుండిపోయేది. ఆరోజుల్లో పద్మావతిని చూసినప్పుడల్లా ఉదయాస్తమానాలు ఆమెకోసమే రంగులు పులుముకుంటాయేమోననిపించేది. నీరెండఛాయలో ఎర్రగా మెరిసే పద్మావతి మొహం నాకిప్పటికీ గుర్తే. ఆమె ముక్కుపుడక మెరుపును అలా చూస్తూండిపోయేవాడిని. తోటలదగ్గరకు ఆమె వచ్చినప్పుడల్లా వనదేవతను చూసినంత అనుభూతి కలుగుతుండేది. నేను తిరపతిలో అగ్రికల్చర్ బిఎస్సీ చేసే రోజుల్లో ఏ అమ్మాయిని చూసినా పద్మావతినే ఊహించుకునేవాడిని. అదంతా నా మూగప్రేమకథ.

ఇప్పుడు పద్మావతిని చూస్తుంటే మనసులో అదే భావన. ఆమె వడలిన గుమ్మడి పువ్వులా వుందిప్పుడు. మెడకింద ఎముకలు కనిపిస్తున్నాయి. చెంపలు పల్చగా అయ్యాయి. కంటి కింద నల్లచారలు వచ్చాయి.రంగు కూడా తగ్గింది. అయినా ఆమె ఆమెనే. నా గుండెను కొట్టుకోమని ఇప్పటికీ శాసించే శక్తి వున్న నా ప్రేమమూర్తినే.

ముప్పిరిగొంటున్న రకరకాల భావాలనడుమ నేను వుండగానే గంగాధరం వచ్చాడు. అప్పుడు కరెంటు కూడా వచ్చింది. గుడిశెలో బల్బు వెలగగానే అందరూ స్పష్టంగా కనిపించారు. నా పద్మావతి కూడా. ఆమె కేసి

ఒకప్పుడు పద్మావతి ఎలా వుండేదంటే గుమ్మడి పువ్వులా వుండేది. కొండ అంచున విరిసిన అడవి మల్లెలా వుండేది. ఎప్పుడూ ఏదో ఒకటి పాడుతూనే వుండేది. ఎవరైనా ఎంత బాగా పాడతావు పద్మావతీ అంటే-అదేముంది గాలిపాట అంటూ మళ్ళీ పాడుకుంటూ వుండిపోయేది.

దీక్షగా చూశాను. పొలమారింది. గ్లాసులో నీళ్లందించిన ఆమె కుడిచేయిపొడుగునా పాములా పొడుగాటి వాతచార. నేనేం చెయ్యగలను. అవును నేనేమి చెయ్యగలను?

ఏదైనా చెయ్యగలను.. నేనిప్పుడు మునుపటి ప్రతాపుడిని కానుగదా. ఆదరిద్రమూ లేదూ...ఆ అధైర్యమూ లేదూ...మనసులో ఒక నిశ్చయానికి వచ్చి లేచాను.

" నువ్వు ఇంటికెళ్ళి పడుకో ప్రతాపన్నా ...నేను నీళ్ళు పెట్టి వస్తాలే" అన్నాడు గంగాధరం.

" పదరా ముందు...నేను నీతో వుంటాను " అని వాడిని పంపాను.

" అమ్మా నువ్వు మాట్టాడుతుండు. నీళ్ళు పెట్టేసి వస్తాం" అని అమ్మకు చెప్పాను.

మెల్లగా అక్కడనుంచి బయటకు వస్తూ పద్మావతి కేసి చూశాను. ఒక్కసారిగా రెండు అలలు ఎదురెదురుగా వచ్చి ఢీకొట్టుకున్నట్టనిపించింది.

నాతో మాట్లాడాలని ఆమెకున్నట్టుంది. ఆ విషయం నాకు స్పష్టంగా తెలుసు. ఆమె కంటిచూపులభాష నాకు కాక ఇంకెవరికి తెలుస్తుంది. ఆమె కేసి చూశాను...నాకళ్ల భాష ఆమెకు అర్థమయింది. తిన్న కంచాలు కడగడానికన్నట్టు అవి తీసుకుని బయటకు వచ్చింది. నీళ్ళ తొట్టెదగ్గర దానిమ్మ చెట్టుకింద నిలబడుకున్నాను నేను. చేతిలో గిన్నెల్ని అక్కడ పెట్టి నాకేసి చూసిన పద్మావతి కళ్ళనిండా నీరు.

" ఛ...ఎందుకేడుస్తావు...నీకు మేమంతా లేమా పద్మావతీ" అన్నాను.

ఆమె మౌనంగానే వుండిపోయింది.

" పద్మావతీ అతనితో మాట్లాడమంటావా...అతనికి ఏం కావాలన్నా నేనిస్తాను...నువ్వు అధైర్యపడకు " అన్నాను.

ఆమె ముఖంలో విషాదపు ఛాయ పరచుకుంది. మెల్లగా గొంతు పెగల్చుకుంటూ -

" ఆయనకు ముందే పెళ్ళయిందట. ఆవిషయం ఎవరికైనా చెబితే చంపుతాను అనేవాడు. అట్లాగే వుండిపోయాను. నాయనకు బాధపెట్టడమెందుకులే అనుకున్నాను. ఆమె ఇప్పుడు ఇంటికే వచ్చేసింది. ఆమెకు బాగా డబ్బుందట. ఇద్దరూ కలిసి కొడుతున్నా పడ్డానుగానీ...నిన్న రాత్రి నిద్రపోతుంటే దాన్నీ నన్నూ చంపడానికి మీద కిరసనాయిలు చల్లారు. ఎలా మెలకువ వచ్చిందో ఏమో...అక్కడ బయటపడి ఇక్కడకు వచ్చాను" ఆ నిశ్శబ్దపు చీకటిలో ఆమె వెక్కిళ్ళు వినపడసాగాయి.

నా కన్నా చిన్నది...అప్పుడే ఆమె జీవితంలో ఎంతెంత చేదును భరించింది...ఎంత చీకటిలో మగ్గిందీ అర్థమయ్యే కొద్దీ...ఒకనాటి నా పిరికితనం మీద నాకు జుగుప్స కలగసాగింది.

ఆమె చేతిని నా చేతుల్లోకి తీసుకున్నాను.

" నేను నిన్ను బయటకు పిల్చింది నీకు నేనున్నాను అని చెప్పడానికే పద్మావతీ...నువ్వు ఎలాంటి అఘాయిత్యం చేసుకోకు. నీ పార్వతితో సహా నిన్ను నాజీవితంలోకి రమ్మంటున్నాను. అప్పుడు నువ్వు ధైర్యం చెయ్యమన్నా చెయ్యలేకపోయాను. నన్ను చేసుకుని నువ్వేమి సుఖపడతావులే అన్న భయం వుండేది.ఇప్పుడవేమి లేవు. నీ ప్రతాపుడు సమర్ధుడయ్యాడు. ఆసామి అయ్యాడు." అంటూ ఆమె చుబుకాన్ని పైకెత్తి కళ్ళల్లోకి సూటిగా చూశాను. ఎవరిశాపం వల్లో గత జన్మలో విడిపోయిన వాళ్ళు ఇప్పుడు కలిసినట్టనిపించింది నాకు. మా కళ్ళు మాట్టాడుకున్నాయి...సరిగ్గా మా ప్రేమరోజుల్లానే...

" ఓ ప్రతాపన్నో మోటరు స్టార్టు కాలేదు" దూరం నుంచి గంగాధరం అరుస్తున్నాడు.

" వస్తా పద్మావతీ...నన్ను మరిచి ఆలోచించవద్దు" అంటూ కదిలాను.

పద్మావతి నాచేతిని గట్టిగా పట్టుకుంది. కాసేపు అలాగే వుండిపోయాను. ఆమె నుదుటి మీద ముద్దు పెట్టాను.

లోపలినుంచి పాప పరుగెత్తుకుంటూ వచ్చింది. పద్మావతి చేయి వదిలేసింది. పసిదాన్ని ఎత్తుకుని బుగ్గమీద ముద్దుపెట్టాను.

'మళ్ళీ వస్తాను' అంటూ తోటకేసి నడవసాగాను.

వెనక్కు తిరిగి చూస్తే తల్లీకూతుళ్లిద్దరూ నా కేసే చూస్తున్నారు...మిమ్మల్ని అక్కున చేర్చుకునేందుకు ఈ పల్లెవుందిలే అని చెప్పాలనిపించింది. మరీ ప్రత్యేకించి చెప్పాలా? నా పల్లె తల్లి గురించి అనుకుని ముందుకే నడిచాను.

పసిది ఏదో పాడుతున్నట్టుంది.

గాలిలో ఆపాట తేలుతూ నావెంటే వస్తూంది.